రేపు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కడప క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భోగిపండుగ సందర్భంగా సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సుదూరప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని సూచించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఎస్పీ కావలెను





ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కడప ఓ ప్రత్యేకమైన జిల్లా. ఒకప్పుడు నాటుబాంబులు, గొడ్డళ్లు, వేటకొడవళ్లు రాజ్యమేలిన ఫ్యాక్షన్‌గడ్డ. ఇక మాజీ సీఎం వైఎస్ జగన్, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సొంత జిల్లా కూడా ఇదే. ఇక్కడ ఏ చిన్న ఇష్యూ జరిగినా రాష్ట్రంలోనే సంచలన మవుతుంది. అలాంటి జిల్లాకు రెండు నెలలు దాటినా రెగ్యులర్ ఎస్పీ లేరు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో బండి నడిపిస్తున్నారు. రాజకీయంగా ఎంతో కీలకమైన ఈ జిల్లాలో శాంతిభద్రతలు చాలా ముఖ్యం. ఇలాంటి జిల్లాకు రెండు నెలలుగా రెగ్యులర్ ఎస్పీని నియమించకపోవడంతో కూటమి ప్రభుత్వం తీరుపై విమర్శలు వస్తున్నాయి.

- రెండు నెలలుగా ఇన్‌చార్జి ఎస్పీతో నెట్టుకొస్తున్న వైనం
- పెరిగిన బెట్టింగ్, గంజాయి, ఇసుక దందా
- జోరుగా బైక్ రైడింగ్‌లు
- పోలీసుల్లో కనిపించని జవాబుదారితనం
- కీలకమైన కడపకు ఎస్పీని నియమించకపోవడంపై సర్వత్రా విమర్శలు
- కడపను వదిలేశారా.. అంటూ వ్యాఖ్యలు

(కడప-ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక హర్షవర్ధన్‌రాజును ప్రభుత్వం ఎస్పీగా నియమించింది. ఆయన తక్కువ కాలంలోనే అటు పోలీసుశాఖపై ఇటు శాంతిభద్రతల్లో తన మార్కు చూపించారు. వైసీపీ హయాంలో పోలీసు వ్యవస్థ అంతా వన్‌సైడ్‌గా ఉండేది. గాడి తప్పిన పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టారు. నిత్యం శాంతిభద్రతల కోసం పోలీసులు రోడ్లపై ఉండే విధంగా ప్లాన్ చేశారు. అయితే టీడీపీ నేతలు హర్షవర్ధన్‌రాజుపై గుర్రుగా ఉండేవారు. ఈ నేపథ్యంలో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్, అనిత తదితరులపై బూతు కంటెంట్‌ను పోస్టు చేసిన పులివెందులకు చెందిన వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు నవంబరు మొదటి వారంలో అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. అయితే ఆయన కడప తాలూకా పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకున్నారు. దీన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వెంటనే నవంబరు 6వ తేదీన ఎస్పీ హర్షవర్ధన్‌రాజుపై బదిలీ వేటు వేసి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. అప్పటి నుంచి అన్నమ్య జిల్లా ఎస్పీ కడప ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు.

గాడి తప్పుతున్న శాంతిభద్రతలు

ఆర్టీపీపీలోని ఫ్లైయాష్ రవాణా విషయంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిల మధ్య మొదలైన మాటల యుద్ధం చివరికి ఇరువర్గాల కార్యకర్తలు బాహాబాహీకి దిగే స్థాయికి వెళ్లింది. ఆ నాలుగురోజులు ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న టెన్షన్ ఉండేది. దానికి కొద్దిరోజుల ముందే ఆదినారాయణరెడ్డికి చెందిన మనుషులు సీఎం రమేశ్ చేస్తున్న ఎలక్ట్రికల్ పనులను అడ్డుకుని దాడి చేశారు. ఈ రెండు సంఘటనలు రాష్ట్రంలోనే కలకలం రేపాయి. ఆర్టీపీపీ వ్యవహారంలో చివరకు సీఎం చంద్రబాబు కలగజేసుకోవాల్సి వచ్చింది. ముందస్తు సమాచారంతో పోలీసులు వాటిని అణచివేసి ఉండింటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అంటారు. రెగ్యులర్ ఎస్పీ లేకపోవడంతోనే శాంతిభద్రతలు గాడి తప్పుతున్నాయనే వాదన వినిపిస్తోంది.

కీలకమైన సోషల్ మీడియా కేసులు

జగన్ హయాంలో కన్నుమిన్ను కానరాకుండా చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్, వంగలపూడి అనిత, మాజీ సీఎం జగన్ తల్లి విజయలక్ష్మి, చెల్లెళ్లు షర్మిల, సునీతలపై నీచాతినీచంగా వైసీపీ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వీటికి సంబంధించి పులివెందులలో నమోదైన ఓ కేసులో ఏ-1 అయిన వైసీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడైన సజ్జల భార్గవరెడ్డి, వైఎస్ జగన్‌కు అల్లుడు వరుసైన అర్జున్ రెడ్డితో పాటు పలువురు వర్రా కేసులో సహ నిందితులుగా ఉన్నారు. వీరిపై రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో కీలకమైన వారంతా కడప జిల్లావారే. దీంతో ఈ కేసులన్నీ పులివెందులకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసుల విచారణ చాలా కీలకం కానుంది. అయితే రెగ్యులర్ ఎస్పీ లేకపోవడంతో నిందితుల అరెస్టు, ఇతరత్రా అన్నీ నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలున్నాయి. విచారణలో సరైన పురోగతి లేదని అంటారు. వర్రా రవీంద్రరెడ్డిని నవంబరు 11వ తేదీన అరెస్టు చేసిన పోలీసులు వెంటనే కస్టడీకి కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకోవడంతో ఈయనను కస్టడీకి తీసుకోవడానికి రెండు నెలల సమయం పట్టింది. దీనికి కారణం పోలీసుల నుంచి సరైన అప్రోచ్ లేకపోవడమే అని అంటున్నారు. ఉన్నత స్థాయి ఆదేశాలు లేకుండా డీఎస్పీ స్థాయి ఇతర స్థాయి అధికారులు కూడా అరెస్టులు ఇతర వాటి కోసం ధైర్యంగా అడుగు వేయడం లేదనే చర్చ నడుస్తోంది. అన్నమయ్య జిల్లా ఎస్పీ కడపకు ఇన్‌చార్జి కావడంతో ఆయనపై పనిభారం పెరిగింది. భౌగోళికంగానూ రెండు జిల్లాలు చాలా పెద్దవి కావడంతో ఎస్పీ ఒక్కరే శాంతిభద్రతల బాధ్యతలు చూసుకోవడం కష్టసాధ్యమనే వాదన వినిపిస్తోంది.

లైట్ తీసుకున్న పోలీసులు

జిల్లాలో జగన్ హయాంలో వైసీపీ నేతల భూకబ్జాలు భారీగా జరిగాయి. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. బద్వేలు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఫోర్జరీతో భూములు రిజిస్టరు చేసుకున్నారు. దీనిపై ఇటీవల కేసు కూడా నమోదైంది. అయితే పోలీసులు పట్టించుకోకుండా లైట్ తీసుకున్నారంటారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చొరవ తీసుకుని నేరుగా ఆయనే రంగంలోకి దిగడంతో చివరికి పోలీసులు అరెస్టు చేయాల్సిన పరిస్థితి వచ్చిందంటారు. మైదుకూరులో తెలుగుగంగ భూములు ఆక్రమించిన వైసీపీ నాయకులపై కూడా కలెక్టర్ ఫోకస్ చేయడంతోనే వారిని అరెస్టు చేశారంటారు.

ఇసుక, మద్యం, గంజాయి దందా

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా మూడు టిప్పర్లు ఆరు ట్రాక్టర్లుగా సాగుతోందంటారు. ఇసుక నిత్యం జిల్లా నుంచి బెంగళూరుకు తరలిపోతుందని చెబుతారు. పోలీసులకు అన్నీ తెలిసినా మాకెందుకులే అని లైట్ తీసుకుని స్థానిక నేతలతో సర్దుబాటు చేసుకుని వదిలేస్తున్నారని అంటున్నారు. దీంతో ఇసుక సరఫరా అడ్డుఅదుపు లేకుండా పోయిందంటారు. ఇక బెల్టుషాపులు షరా మామూలే. వాటిని అడ్డుకునేవారే లేరు. బ్రాంది షాపు యాజమాన్యం స్థానిక పోలీసులతో సెట్ చేసుకుని బెల్టుషాపులకు గేట్లు ఎత్తినారంటారు. కడప నగరంలోనే ప్రధాన రహదారులకు అనుకుని ఉండే మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా సిట్టింగ్ ఏర్పాటు చేసినా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

బైక్ రైడింగ్

కడప జిల్లా హెడ్‌క్వార్టర్. అయితే ఇక్కడ పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. యువకుల ర్యాష్ డ్రైవింగ్ , బైక్ రైడింగ్ పెరిగిపోయాయి. నాగరాజుపేట, నెహ్రూపార్కు రోడ్డు, ఐటీఐ, రింగురోడ్డు, అప్సరా సర్కిల్, అలంఖాన్‌పల్లె రోడ్డు.. ఇలా ప్రధాన రోడ్లలో మమ్మల్ని ఆపే దమ్ము ఎవరికుంది అన్నట్లుగా డ్రైవింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ కూడా అస్తవ్యస్తంగా మారింది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో పేకాట మళ్లీ ప్రారంభమయిందంటారు. కడపలోని బిల్టప్ ప్రాంతంలో ఏకంగా జూదశాల నిర్వహిస్తున్నారనే ప్రచారం ఉంది. గంజాయి మళ్లీ మొదటికి వచ్చిందంటారు. జిల్లాలో రెగ్యులర్ ఎస్పీ లేకపోవడంతో జూదం, పేకాట, గంజాయి ఇలా అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయని చెబుతున్నారు. రెండు మాసాలు దాటినా సరే ఇంకా ఎస్పీని నియమించకపోవడంతో అసలు కడపకు ఎస్పీని వేస్తారా లేదా అన్న చర్చ నడుస్తోంది. ఇది చాలా కీలకమైన జిల్లా. ఇక్కడ ఏం జరిగినా పెద్ద సంచలనం అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం రెగ్యులర్ ఎస్పీని నియమించాలని జనం కోరుతున్నారు.

వద్దే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం

- జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ వడ్డే ఓబన్న 11 జనవరి 1807లో నంద్యాల జిల్లా సంజమల మండలంలోని నొస్సంలో జన్మించారన్నారు. బ్రిటీష్ పాలనలో గ్రామ రక్షకుల జీతాలు రద్దు చేయడం, రైతులపై అధిక పన్నులు విధించడంతో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేతృత్వంలో తిరుగుబాటు జరిగిందన్నారు. 1846లో కోవెలకుంట్ల తహశీల్దారు, ఖజానా కార్యాలయాలపై దాడులు చేసి ఆ నిధులను రైతులకు పంపిణీ చేశారన్నారు. అప్పటో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వెంట వడ్డే ఓబన్న నడిచారన్నారు. అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ బ్రిటీస్ పాలకులపై పోరాడిన వడ్డే ఓబన్న నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, స్టెప్ సీఈవో సాయిగ్రేస్, వడ్డెర కుల నాయకులు రమణ, నారాయణ, వెంకటరమణ, నాగేశ్వరరావు, సింహాద్రి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీబీఐటీ కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి



సంక్రాంతి పండుగ.. ప్రాచీన సంప్రదాయం

చాపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ప్రాచీన సంప్రదాయానికి నిదర్శనమని సీబీఐటీ కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి, అనంతపురం జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు అన్నారు. సీబీఐటీ కాలేజీలో శనివారం ముందస్తు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గాలిపటాలను ఎగురవేశారు. పలురకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. నూతన కుటీరాలు, గంగిరెద్దుల ఆట, పాట, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, భోగిమంటలు, కోలాటం జరిపించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను అధ్యాపకులు, విద్యార్థులు ఫ్రెషర్స్‌డేగా జరుపుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. యాంత్రిక జీవనం సాగిస్తూ సంప్రదాయ పండుగలను మరచిపోతున్నారన్నారు. వాటిని అందరూ కలిసి మెలసి జరుపుకోవాలన్నారు. అవధాని నరాల రామారెడ్డి, గీత రచయిత సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, డాక్టర్ దస్తగిరిరెడ్డి మాట్లాడారు.



సీబీఐటీ కళాశాలలో భోగిమంటలు వేస్తున్న దృశ్యం

వేడుకగా గోకులాల ప్రారంభం



ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీలో గోకులం ప్రారంభించిన అనంతరం పశువుల గాటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుకు ఆదరువుగా పశువులకు నీడ కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన గోకులాల ప్రారంభోత్సవాలు వేడుకగా సాగాయి. వీటి ప్రారంభోత్సవాల ప్రాంతంలో పండుగ వాతావరనం నెలకొంది. మండలానికి 25 చొప్పున జిల్లాకు 835 గోకులాలు మంజూరయ్యాయి. ఇందులో 412 గోకులాలకు శనివారం ప్రారంభోత్సవం చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో గోకులాన్ని ప్రారంభించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గోపవరం పంచాయతీలో గోకులానికి ప్రారంభోత్సవం చేశారు. జమ్మలమడుగు మండలం పెద్దదండ్లూరులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎర్రగుంట్ల మండలం పెద్దనపాడులో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బి.కోడూరులో బద్వేలు ఇన్‌చార్జి రితేశ్‌రెడ్డి, చక్రాయపేటలో పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి గోకులాలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కూటమి నాయకులు గోకులాలను ప్రారంభించారు. ఈనెల 11, 12, 13 తేదీలలో గోకులాలను ప్రారంభించాలని అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. శనివారం 412 వాటిని ప్రారంభించగా మిగిలిన గోకులాలను ఆది, సోమవారాల్లో ప్రారంభించనున్నారు. ఆదివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ మైదుకూరు మండలంలోని శివపురంలో గోకులాన్ని ప్రారంభించనున్నారు. బద్వేలులో కూడా గోకులాల ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధను అధికారయంత్రాంగం ఆహ్వానించింది. రెండుపశువులు ఉన్న గోకులానికి రూ.1.15 లక్షలు, నాలుగు పశువులున్న వాటికి రూ.1.80లక్షలు, ఆరు పశువులున్న వాటికి రూ.2.30లక్షలు ఖర్చుచేయనున్నారు. గడిచిన ఐదేళ్లకాలంలో గోకులాల నిర్మాణం ఊసేలేకుండా పోయింది. అంతకుముందు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రైతులకు అండగా నిలవడంతో పాటు గోకుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. చాలా మంది రైతులు సొంత డబ్బులు ఖర్చుపెట్టి గోకులాలను నిర్మించుకున్నారు. 2019లో బిల్లులు చెల్లించే క్రమంలో ఎన్నికల కోడ్ రావడం వల్ల ఆగిపోయాయి. అనంతరం వైసీపీ కొలువుదీరింది. దీంతో జిల్లాలో చాలా మంది రైతులు గడిచిన ఐదేళ్లుగా అధికారులు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తామంటూ ఊరించారే తప్ప రైతుల సొమ్ము చెల్లించలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో గోకులాలు ఊపిరిపోసుకున్నాయి. రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ప్రైవేటు బాదుడు

సుదూర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు సంక్రాంతి పండుగకు స్వంత ఊర్లకు కుటుంబాల సమేతంగా తరలి వస్తారు. ముఖ్యంగా హైదరాబాదు, విజయవాడ, చెన్నై, బెంగళూరులలో ఉద్యోగాలు చేస్తూ అక్కడ స్థిరపడ్డవారు పెద్దఎత్తున వచ్చి పండుగదినాల్లో ఆనందంగా బంధుమిత్రులతో గడిపి వెళతారు. ఇదే అదనుగా ప్రైవేటు బస్సు ట్రావెల్స్ వారు ఈ పండుగ దినాల్లో బస్సు టికెట్ల ధరలు అడ్డగోలుగా పెంచేసి దోపిడీకి పాల్పడుతున్నారు. ఏకంగా ఆన్‌లైన్‌లోనే బస్సు టికెట్ల రేట్లు పెంచి వసూళ్లు చేస్తున్నా రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి ఏపీలోని స్వంత గ్రామాలకు వచ్చే వారికి అదనపు ఆర్థికభారం తప్పడం లేదు.





- స్వంత ఊర్లకు బస్సు ప్రయాణం భారం
- హైదరాబాదు, విజయవాడ, బెంగళూరు, చెన్నైలకు అధిక వసూళ్లు
- ప్రైవేటు ట్రావెల్స్ వారు ఆన్‌లైన్‌లోనే పెంచిన టికెట్ల ధరలు
- చర్యలు తీసుకుంటామంటూ.. చోద్యం చూస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీన రవాణా శాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ యజమానులతో సమావేశం నిర్వహించి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 11 నుంచి 19వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి అధిక చార్జీలు వసూలు చేసినట్లయితే భారీగా జరిమానాలు విధిస్తామన్నారు. ఆ హెచ్చరికలు ఎవ్వరూ ఖాతరు చేయడం లేదు. ఇందుకు ప్రైవేటు ట్రావెల్స్ వారు ఆన్‌లైన్‌లో పెంచిన టిక్కెట్ల ధరలే నిదర్శనం.


ప్రొద్దుటూరు నుంచి 150 ప్రైవేటు బస్సులు

జిల్లాలో కడప కంటే కూడా ప్రొద్దుటూరు నుంచే ప్రైవేటు బస్సులు ఎక్కువ నడుస్తున్నాయి. ఇక్కడి నుంచి దాదాపు 150 ప్రైవేటు బస్సులు హైదరాబాదు, విజయవాడ, బెంగళూరు, చెన్నైలకు ఉన్నాయి. ప్రొద్దుటూరులో ఏకంగా 22 ప్రైవేటు బస్సు ట్రావెల్స్ ఏజన్సీలు ఉన్నాయి. ఆర్టీసీ మాత్రం అరకొర బస్సులతో సరిపెట్టింది. దీంతో ఆర్టీసీలో చార్జీలు తక్కువైనా ప్రైవేటును ఆశ్రయించక తప్పనిపరిస్థితి నెలకొంది. ప్రొద్దుటూరు నుంచి హైదరాబాదుకు ఆర్టీసీ సూపర్‌లగ్జరీలో సిట్టింగ్ టిక్కెట్టు ధర రూ.680 నుంచి రూ.720. ఈ డిపో నుంచి హైదరాబాదుకు కేవలం మూడు సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయి. విజయవాడకు రెండు సూపర్‌లగ్జరీ సర్వీసులు ఉండగా సిట్టింగ్ టికెట్టు ధర రూ.670, బెంగళూరుకు ఉదయం రాత్రి కలిపి ఆరు సర్వీసులు ఉండగా టిక్కెట్ ధర రూ.580 మాత్రమే. చెన్నైకి ప్రొద్దుటూరు డిపో నుంచి సర్వీసు తీసేశారు. పొరుగున ఉన్న డిపోల నుంచి టిక్కెట్ ధర రూ.580 మాత్రమే. పండుగ రోజుల్లో కూడా ఆర్టీసీ బస్సు టికెట్ ధరలు పెంచలేదు.

ప్రైవేటులో బాదుడే బాదుడు

హైదరాబాదు నుంచి ప్రొద్దుటూరుకు రావాలంటే ఆన్‌లైన్‌లో సింగల్ సీటు ధర రూ. 1500 నుంచి రూ.1700 వరకు చూపుతున్నారు. డబుల్ సీట్లకు దాదాపు రూ.2000 నుంచి రూ.5000 వరకు వసూలు చేస్తున్నారు. విజయవాడ నుంచి ప్రొద్దుటూరుకు ఆన్‌లైన్లో సింగల్ సీటు రూ.1700 నుంచి రూ.2000 వరకు చూపెడుతున్నారు. డబుల్ సీట్లయితే అదనంగా వసూలు చేస్తున్నారు. బెంగళూరు నుంచి ప్రొద్దుటూరుకు రూ.1800 నుంచి రూ.2000కు పైగా వసూలు చేస్తున్నారు. చెన్నై నుంచి ప్రొద్దుటూరుకు రూ.1900 నుంచి రూ.2000 తీసుకుంటున్నారు. ఇవి శనివారం రోజు ధరలు మాత్రమే. ఆది, సోమవారాల్లో ఈ ధరలు మళ్లీ మారిపోతాయని ఏరోజు రేట్లు ఆరోజు అని ట్రావెల్స్ వారు చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాదు, బెంగళూరు, చెన్నైలలో స్థిరపడిన వారు ప్రైవేటు ట్రావెల్స్‌లో రావాలంటే ఒక్కో కుటుంబానికి దాదాపు రూ.10వేలు అవుతోందని చెబుతున్నారు. మరో వారం రోజులు ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ కొనసాగుతుంది. 11వ తేదీ అంటే శనివారం నుంచి స్పెషల్ డ్రైవ్ పెట్టి చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ అధికారులు ముందస్తుగా హెచ్చరించినా ఆ మేరకు ఎక్కడా చర్యలు తీసుకోవడం లేదు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు..



8 తేదీన ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించాం. ఆర్టీసీ కంటే అదనంగా టిక్కెట్ ధరలు వసూలు చేయరాదని హెచ్చరించాం. ఆన్‌లైన్లో అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపాం. ప్రయాణికుల లగేజీ తప్ప ఇతర గూడ్స్‌ను తరలిస్తే కేసులు రాస్తామని హెచ్చరించాం. ఈ నెల 19వ తేదీ వరకు జిల్లా అంతా స్పెషల్ డ్రైవ్ పెడుతున్నాం.

\- మురళి, ఆర్టీవో, ప్రొద్దుటూరు

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ







ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

భావితరాలకు స్ఫూర్తి వడ్డే ఓబన్న

నివాళులర్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శనివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వడ్డే ఓబన్న చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వడ్డే ఓబన్న స్వాతంత్ర్య సమరయోధుడు, యుద్ధ వీరుడు అని ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సర్వ సైన్యాధ్యక్షుడిగా ఉండి బ్రిటీషర్లపై పోరాడి ప్రాణ త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణ డీలర్ పరీక్షల్లో 257 మంది అర్హులు

మదనపల్లె టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణ డీలర్ల నియామకం కోసం నిర్వహించిన పరీక్షల్లో 257 మంది అర్హులైనట్లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల నియామకం కోసం గత నెల 31వ తేదీ మదనపల్లెలో రాత పరీక్షలు నిర్వహించారు. 709 మంది దరఖాస్తు చేసుకోగా 369 మంది రాత పరీక్షలు రాశారు. ఈ క్రమంలో శనివారం విడుదల చేసిన ఫలితాల్లో 257 మంది అర్హులైనట్లు సబ్ కలెక్టర్ ప్రకటించారు. కాగా 15 దుకాణాలపై కొందరు హైకోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తీసుకొచ్చారని, మిగిలిన దుకాణాలకు అర్హులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఫలితాలను ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచుతామని తెలిపారు.

స్కానింగ్ యంత్రాలు స్వాధీనం



స్కానింగ్ పరికరాలను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

పీలేరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని నోబుల్ నర్సింగ్ హోంలో ఉన్న స్కానింగ్ యంత్రాలను శనివారం జిల్లా వైద్య శాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు వైద్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య సూచనల మేరకు ఆ నర్సింగ్ హోంలోని యంత్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ పర్యవేక్షణలో అధికారులు స్వాధీనం చేసుకుని రాయచోటికి తరలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న సమాచారంతో గత ఏడాది సెప్టెంబరు 13వ తేదీ జిల్లా అధికారులు నోబుల్ నర్సింగ్ హోంపై దాడులు నిర్వహించి ఆ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.బాషాను పట్టుకున్నారు. అప్పట్లో ఆసుపత్రిని, ఆసుపత్రిలోని స్కానింగ్ యంత్రాలను సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన యంత్రాలను అధికారుల స్వాధీనంలో ఉంచుకోవాలని ఇటీవల కలెక్టర్ ఆదేశించడంతో వైద్య శాఖాధికారులు వాటిని రాయచోటికి తరలించారు. యంత్రాల స్వాధీనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ సహకరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కుసుమ, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది చేతివాటం

- ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్
- చనిపోయిన వారి పేరిట ఉపాధి బిల్లులు
- వలంటీర్లు, ఉద్యోగులూ కూలీలే
- రూ.20 లక్షలు తినేశారు..
- సిబ్బందిపై వేటు వేసిన డ్వామా పీడీ



ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ వెంకటరత్నం

గుర్రంకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో చేతివాటం చూపిన సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం వ్యక్తం చేసి ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. అంతేకాకుండా సిబ్బంది నుంచి రూ.39,452 రికవరీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకంలో పనులు చేశారు. వారి ఆత్మలు వచ్చి డబ్బులు డ్రా చేసుకున్నాయి. ట్రాన్స్‌కో, మోడల్ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులు కూడా రోజూ ఉపాధి పనులు చేయడం విశేషం. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లగా ఉంటూనే ఉపాధి పథకంలో పనులు చేసి వేలాది రూపాయలను సొమ్ము చేసుకుని అవినీతికి పాల్పడిన సంఘటనలు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో వెలుగుచేశాయి.

గుర్రంకొండ మండలంలో ఉపాధి హామీ పథకంలో చేసిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం వారం రోజులపాటు తనిఖీ చేసింది. ఇందులో భాగంగా మండలంలో రూ.7.77 కోట్లతో పనులు చేశారు. ఈ పనులను తనిఖీ బృందం పరిశీలించి వివరాలను అధికారులకు నివేదిక ఇచ్చారు. దీంతో డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన వివరాలను వెల్లడించారు. అమిలేపల్లె గ్రామానికి సుధాకర్ ట్రాన్స్‌కో శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ ఉపాధి హామీ పథకంలో కూలీ పనులు చేసి సొమ్ము తీసుకున్నాడు. వనజ అనే మహిళ ఓ మండలంలోని మోడల్ పాఠశాలలో ఉద్యోగిగా ఉంటూనే గ్రామంలో ఉపాధి పనులు చేసినట్లు చూపి అవినీతికి పాల్పడినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. శెట్టివారిపల్లె పంచాయతీలో పి.రామచంద్ర అనే వ్యక్తి 2017వ సంవత్సరంలో చనిపోగా 2023వ సంవత్సరంలో ఉపాధి పనులు చేసినట్లు చూపారు. అలాగే అదే పంచాయితీకి చెందిన సి.వెంకటప్ప 2019లో చనిపోతే 2023లో ఉపాధి పనులు చేసినట్లు చూపి సొమ్ము డ్రా చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. అలాగే టి.రాచపల్లెకు చెందిన రాజశేఖర్, మర్రిపాడుకు చెందిన మరో నలుగురు, అమిలేపల్లెకు చెందిన ఇద్దరు వలంటీర్లు ఉపాధి పనులు చేసి అవినీతికి పాల్పడినట్లు బహిరంగ సభలో వెలుగుచూసింది. అమిలేపల్లె గ్రామంలో రాయునిచెరువులో అమృత్ సరోవర్ పథకంలో మినీ ట్యాంక్ పనులు చేయకుండానే రూ.3,85 లక్షలు, రాయునిచెరువు నుంచి దిగువచెరువుకు వెళ్లే వంక పనులు చేయకుండానే రూ.3 లక్షలు, రైతుల భూమిలో చేయాల్సిన ఫారంపాండ్‌ను ప్రభుత్వ భూమిలో చేయడంతో రూ.36 వేలు, రాయునిచెరువుకు వచ్చే మరో వంక పనులకు రూ.1,49 లక్షల పనుల్లో అవినీతికి జరిగినట్లు తనిఖీ బృందం గుర్తించింది.

అలాగే రైతుల భూముల్లో రోజా మొక్కల పెంపకం పనుల్లో భాగంగా అమిలేపల్లెకు చెందిన నలుగురు రైతుల పొలాల్లో 4 వేల రోజా మొక్కలు పెంచుతున్నారు. ఈ రోజా మొక్కల పెంపకం పనుల్లో సుమారు 3 వేలు మొక్కలు లేకుండానే వేలాది రూపాయలు బిల్లులు చేసినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. అలాగే పొలాల్లో చేసే రింగ్ ట్రెంచ్‌ల పనుల్లో రూ.39 వేల అవినీతిని గుర్తించారు. వివిధ గ్రామాల్లో మస్టర్లలో బినామీ పేర్లతో వేలాది రూపాయలను స్వాహా చేసినట్లు తెలిపారు. పనుల వద్ద ఏర్పాటు చేసే బోర్డులు లేకుండానే సొమ్ము చెల్లించినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. హౌసింగ్ పథకంలో పునాది పనులు చేయకుండానే బిల్లులు చేసినట్లు తెలిపారు. అలాగే మస్టర్‌లో కూలీల సంతకాలు కూడా ఒక్కరే చేసి నిధులు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. రైతుల పొలాల్లో మొక్కల పెంపకం పనులకు సంబంధించి ఐదు గ్రామాలకు చెందిన రైతుల సొమ్మును ఎల్లుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతాకు రూ.1,02,188లను టెక్నికల్ అసిస్టెంట్ రవినాయక్ ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో రూ.20 లక్షల వరకు అవినీతి జరిగినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనరసింహ, ఎంపీడీవో వెంకటేశులు, ఏపీవో జయరామిరెడ్డి, ఎస్‌ఆర్పీ సుబ్బారావు, నాయకులు జగదీష్, ఎల్లుట్ల మురళీ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురి సస్పెన్షన్

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడిన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. అమిలేపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ లోకనాథ్‌ను శాశ్వతంగా తొలగించినట్లు తెలిపారు. అలాగే ఎల్లుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ శంకరయ్య, శెట్టివారిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ సిమ్రాన్‌లను తాత్కాలికంగా తొలగించినట్లు తెలిపారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్ రవినాయక్‌ను కూడా తాత్కాలింగా తొలగించినట్లు డ్వామా పీడీ తెలిపారు.

రూ.39,452 రికవరీ...

మండలంలోని జరిగిన ఉపాధి పథకం బహిరంగ సభలో రూ.39,452ను రికవరీ చేసినట్లు డ్వామా పీడీ తెలిపారు. ఇందులో భాగంగా ఏపీవో నుంచి రూ.3500, ఈసీ నుంచి రూ.8700, బీఎఫ్‌టీ నుంచి రూ.1500, టీఏ రవి నుంచి రూ.17,351, టీఏ మదన్ నుంచి రూ.1000, సీవో (కంప్యూటర్ ఆపరేటర్)లు రెడ్డెప్ప నుంచి రూ.5274, పుణ్యవతి నుంచి రూ.2127 మొత్తం రూ.39,452 నగదును రికవరీ చేసినట్లు తెలిపారు.

మంత్రి మండిపల్లి హామీతో సమ్మె విరమణ



కార్మిక సంఘాలతో చర్చిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు

ఓబులవారిపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ కార్మిక సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. ఏపీఎండీసీ కార్మికులు తొమ్మిది రోజులుగా వారి హక్కుల సాధన కోసం చేస్తున్న ఉద్యమాన్ని తెలుసుకొని మంత్రితో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డితో కలిసి కార్మికులతో చర్చలు జరిపారు. మంగంపేట గ్రామ పెద్దలు ఈ చర్చల్లో ఉన్నారు. కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసులో ఉన్న ఐదు డిమాండ్ల పైన మంత్రి చర్చలు జరిపి ఈ సమస్యలన్నీ 25వ తేదీ లోపు విజయవాడలో గనుల శాఖ మంత్రితో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీఎండీసీ ఎండీతో మీటింగ్ ఏర్పాటు చేయించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశం ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమాన్ని వాయిదా వేయాలని మంత్రి కోరగా సమ్మెను తాత్కాలికంగా 15 రోజులు వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అన్ని ఏపీఎండీసీ కార్మిక సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కూతుర్లపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రి అరెస్ట్

నిమ్మనపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కన్న కూతుర్లపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కొండయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి సొంత కూతుళ్లపై అఘాయిత్యానికి పాల్పడినట్లు తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. గ్రామంలో విచారణ చేసి నిందితుతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్య

రామసముద్రం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో కూతురు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుకన్య వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన సుకన్య కూతురు కణ్యేశ్వరి (15) కర్ణాటకలోని సోమయాజులపల్లెలో పదో తరగతి చదువుతోంది. శనివారం ఇంటి వద్ద కూతురు సెల్‌ఫోన్ చూస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన కణ్యేశ్వరి పురుగుల మందు తాగింది. మదనపల్లె ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిందని తల్లి తెలిపింది.

లేగదూడల పెంపకంలో మెలకువలు పాటించాలి

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ



విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

చెన్నూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు లేగదూడల పెంపకంలో తప్పనిసరిగా మెలకువలు పాటించాలని తద్వారా అవి ఆరోగ్యంగా పెరిగి యజమానికి ఆదాయ వనరుగా మారతాయని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ అన్నారు. నరసారెడ్డిపల్లెలో ఏపీ ఎల్‌డీఏ, కడప ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన లేగదూడల పరిరక్షణలో జిల్లా పశువైద్యాధికారి లేగదూడల పెంపకంలో మెలకువలు, అవగాహన కల్పించారు. నేటి పరిస్థితుల్లో లేగదూడల పెంపకాన్ని శాస్త్రీయ పద్దతుల ద్వారా పెంచాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు ఎలాంటి సమయంలో ఇవ్వాలి, వ్యాధులు ఎలా గుర్తించాలి, గుర్తించకుంటే కలిగే నష్టాలు, వ్యాధులు రాకుండా చూసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి రకం దూడలను ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ విధానంపై ఆసక్తి చూపితే తక్కువ సమయంలోనే ఆరోగ్యవంతమైన లేగదూడలు పుట్టడం, వాటి ద్వారా ఆదాయం, అభివృద్ధిని సాధించవచ్చన్నారు. అనంతరం ప్రదర్శనకు వచ్చిన 42 లేగదూడలను పరిశీలించారు. వాటి యజమానులతో మాట్లాడారు. పశువైద్యాధికారుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా పెంచుకున్న లేగదూడలు రైతు కుటుంబానికి మంచి ఆదాయ వనరని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న ముగ్గురు రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. వీటితో పాటు క్యాల్షియం మందులు, ఏలికపాము నివారణ మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కడప ఏడీ శ్రీనివాసులరెడ్డి, ఏపీఎల్‌డీఏ వైద్యులు డాక్టర్ శివరామిరెడ్డి, శరత్, గొర్రెల విభాగం వైద్యాధికారి నవీన్‌రెడ్డి, స్థానిక వైద్యులు ఉపేంద్ర, ఎర్రపేరురెడ్డితో పాటు పశువైద్య సిబ్బంది కల్యాణ్, రజిత, రవి, జీవన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణా అధికారుల దాడులు

పర్మిట్‌లు లేకుండా తిప్పుతున్న బస్సులు సీజ్

రూ. 5.49 లక్షల జరిమానా



ఇడమడక టోల్ గేట్‌వద్ద బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

ప్రొద్దుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగవేళ అక్రమంగా తిప్పుతున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై ప్రొద్దుటూరు రవాణా అధికారులు దాడులు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున చాగలమర్రి టోల్ గేట్ వద్ద హైదరాబాదు నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న బస్సులను ఆర్‌టీఓ మురళీ ఆధ్వర్యంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రెండు బస్సులకు పర్మిట్ లేకున్నా అక్రమంగా తిప్పుతున్నట్లు గుర్తించారు. ఈరెండు బస్సులకు రూ.5.24 లక్షలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులో ప్రయాణీకులనే కాకుండా అక్రమంగా గూడ్స్ రవాణా చేస్తున్న మరో రెండు బస్సులను సీజ్ చేశారు. వీటికి పదివేలు వంతున రూ.20 వేలు జరిమానా విధించారు. మరో బస్సుకు ఎఫ్‌సి లేనందున రూ.5వేలు జరిమాన విధించినట్లు ఆర్‌టీఓ తెలిపారు.

ఈ డీఈఓ మాకొద్దు

స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు సంఘాల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను తీవ్రంగా దుర్భాషలాడుతూ, మానసిక క్షోభకు గురిచేస్తున్న డీఈఓ మీనాక్షి మాకొద్దని వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కమిషనర్ విజయరామరాజును కోరారు. శనివారం మంగళగిరి కమిషనరేట్‌లో కమిషనర్ విజయరామరాజు, మంగళగిరి టీడీపీ ఆఫీస్ ఇన్‌చార్జి కొనకల్ల నారాయణకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు లెక్కల జమాల్‌రెడ్డి, రామాంజనేయులు, అంకాల కొండయ్య, రమణారెడ్డి, పి.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ డీఈఓగా బాధ్యతలు తీసుకున్న ఆమె పలు పాఠశాలల సందర్శించినపుడు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తోందన్నారు. ఆవె ఏదో ఒక వంక చూపుతూ తిట్ల దండకం మొదలు పెడుతుందని చెప్పారు. ఇటువంటి డీఈఓ జిల్లాకు ఉండడం దురదృష్టకరమని ఉండకూడదన్నారు. జిల్లాలోని 27 సంఘాల ఉపాధ్యాయ సంఘాల నేతలంతా ఈ డీఈఓ మాకు వద్దని ఉద్యమ కార్యాచరణ ప్రకటించారన్నారు.

'పరిశ్రమల సహకారంతో ఉన్నత విద్యాభివృద్ధి'

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ప్రయోగాత్మక అభ్యసనం, ఒకే దేశం ఒకే పరీక్ష, నిరంతర సమగ్ర మూల్యాంకన పద్దతుల, వినూత్న పద్దతుల అమలుపై వైస్ చాన్సలర్ సమావేశంలో చర్చించినట్లు యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. తమిళనాడులోని వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని అన్నా ఆడిటోరియంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) 10,11 తేదీల్లో పునరాలోచన అసెస్‌మెంట్ మూల్యాంకనంపై రెండు రోజుల సౌత్‌జోన్ వైస్ చాన్సెలర్ల సమావేశంలో వైవీయూ వీసీ ఉన్నత విద్యపై ప్రసంగించారు. స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, ఇంక్యుబేటర్‌లతో సహకారాన్ని అన్వేషించడం ద్వారా ఆవిష్కరణలను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతతో ఉందన్నారు. విద్యా సంస్థలు పరిశ్రమలతో అనుసంధానమై పని చేసే నైపుణ్యత గల విద్యార్థులు సమాజంలో వస్తారని ఆ దిశగా ప్రయత్నాలు జరగాలన్నారు. ఈ చర్చల్లో వైవీయూ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, ఏపీ నుంచి ప్రొఫెసర్ పి.పాపారావు (ఎస్‌వీ తిరుపతి), ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ (రాయలసీమ యూనివర్సిటీ) చర్చల్లో పాల్గొని భారతదేశ ఉన్నత విద్యపై సమ్మిళిత వృద్ధికి విలువైన సూచనలను అందించారు.

సాయి ఏజెన్సీని రద్దు చేయాలి


మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్

కడప నాగరాజుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్లాప్ వాహనాలు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడపలో నడుస్తున్నాయని, కార్మికులకు రూ.18వేలు ఇవ్వాల్సి ఉండగా దాదాపు రూ.10500 మాత్రమే ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. విశాఖలో రూ.18వేలు ఇస్తున్నారన్నారు. కడపలో రూ.13వేలు అని చెప్పి రూ.10500 మించి ఇవ్వడం లేదన్నారు. రెడ్డి ఏజెన్సీ మీద, పావని ఏజెన్సీ మీద లేబర్ డిపార్ట్‌మెంట్‌లో చర్చలు నడుస్తున్నాయని గుర్తుచేశారు. అయినా సాయి పావని యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. ఇప్పటికైనా తక్కువ వేతనాలు ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేసి కార్పొరేషన్, మున్సిపాలిటీలు నిర్వహించాలన్నారు. జీఓ 7 ప్రకారం రూ.24500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల ద్వారా వసూలు చేస్తున్న డబ్బు ఒక్కో వాహనానికి దాదాపు రూ.63000 ఇస్తున్నారని, డీజిల్, డ్రైవర్ ఇతరుల పేరు మీద రూ.30 నుంచి రూ.40వేలు మాత్రం కూడా ఖర్చుపెట్టలేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టలేదని ఆరోపించారు. వీటిపై విచారణ చేసి పావని ఏజెన్సీపై, రెడ్డి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

అడ్డంకుల నడుమ ఆరు లేన్లు

20 కి.మీ రోడ్డు పనులకు నాలుగున్నర కి.మీ అభ్యంతరాలు

● క్లియరెన్స్ అయ్యేనా...? ● పనులు పూర్తయ్యేదెప్పుడు



ఆరు లేన్ల రహదారికి జరుగుతున్న కారిడార్ నిర్మాణం

పోరుమామిళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణాల నుంచి రాజధాని నగరాలకు వెళ్లాలన్నా, మెగా నగరాలకు వెళ్లాలన్నా ప్రయాణీకుల దూరాన్ని తగ్గిస్తూ ప్రయాణీకుల మెరుగైన సౌకర్యం కల్పించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా విజయవాడ మీదుగా కడప, బెంగళూరుకు వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణం ఆరు లేన్ల రహదారికి పనులు 20 కిలో మీటర్ల మేర పనులు జరిగితే నాలుగున్నర కిలో మీటర్ల మేరకు అభ్యంతరాలు వ్యక్తం మవుతున్నాయి. ఆరులేన్ల రహదారికి నిధులు కేటాయించింది. వివరాల్లోకెళితే...

విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేవారికి. బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లేవారికి తక్కువ దూరం పట్టేందుకు వీలుగా నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మల్లేపల్లె నుంచి కవలకుంట్ల రెవెన్యూ పొలాల వరకు దాదాపు 20 కి.మీ పొడవునా ఆరు లేన్ల రహదారికి రూ.622 కోట్లు నిధులు కేటాయించింది. మల్లేపల్లె నుంచి చెన్నారెడ్డిపేట వరకు అర్త్ పనులు ప్రారంభమయ్యాయి. 20 బ్రిడ్జిలు అండర్‌ప్రాసెస్‌లో ఉన్నాయి. సిద్దవరం వద్ద దాదాపు 5 కి.మీ అర్త్ వర్క్ జరుగుతోంది. అటవీశాఖకు సంబంధించి ఇంకా కిలోమీటరు క్లియరెన్స్ కావాల్సి ఉండగా ఈ పనులు దక్కించుకున్న మెగా ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్స్ వారు అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదిక కోరింది. మూడున్నర కిలోమీటరు రైతులకు సంబంధించి నష్టపరిహారం కొందరికి అందకపోవడం వల్ల ఆ పనులు కూడా కొద్దిగా జాప్యం జరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 15శాతం పనులు జరిగాయి. కొన్నిచోట్ల టన్నెల్ పనులు జరుగుతున్నాయి. దాదాపు ఆరులేన్ల రహదారికి సంబంధించి 8గ్రామాలకు 162 ఎకరాల పొలాలు రహదారికి అవసరం అవుతాయి. వీటి కోసం రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే వారి కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు నిదులు మంజూరు చేసింది. ఇందులో దాదాపు 247 మంది రైతులకు రూ.13 కోట్ల వరకు పంపిణీ జరిగినట్లు సమాచారం. ఇంకా 68 ఎకరాలకు సంబంధించి 56 మంది రైతులకు పరిహారం అందాల్సి ఉంది. అయితే రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి భూములు కోల్పోయిన వారందరికీ పరిహారం అందిస్తామని చెబుతున్నారు. ఇటీవల జేసీ కూడా భూములు పరిశీలించి పనులకు అభ్యంతరాలు తెలపవద్దని, అర్హులందరికీ నష్టపరిహారం దక్కేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి గతంలో రెవెన్యూ అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి భూములు కోల్పోయే వారి విస్తీర్ణం, రికార్డులను అప్పజెబితే వారందరికీ పరిహారం అందిస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆరులేన్ల రహదారికి అడ్డంకులన్నీ పూర్తి చేసుకుని నిర్మాణం వేగవంతమైతే పూర్తయ్యే సమయానికి ఎంత సమయం పడుతుందోనని ఈ ప్రాంతీయులు ఎదురు చూస్తున్నారు. కొన్ని చోట్ల గ్రావెల్‌కు మైనింగ్ అధికారుల అనుమతులు కూడా అందాల్సి ఉందని తెలిసింది. ఈ అడ్డంకులన్నీ తొలగి పనులు ఎప్పుడు వేగవంతమవుతాయో, ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొందరు రైతులు అయితే నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.



ఆరు లేన్ల రహదారికి నీళ్లు తడుపుతున్న దృశ్యం



రోలరుతో చదును చేస్తున్న దృశ్యం

రూ. కోటి స్థలంలో ఆగని అక్రమాలు

ఖద్దరు అండతో సాగుతున్న నిర్మాణాలు ● పోలీసులు హెచ్చరికలు చేసినా ప్రయోజనం శూన్యం

పట్టించుకోని నేషనల్ హైవే అథారిటీ అధికారులు



ప్రభుత్వ స్థలంలో సాగుతున్న పనులు

రైల్వేకోడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కబ్జా స్థలంలో అక్రమ కట్టడాలు సాగుతున్నాయి. ఖద్దరు అండతో నిర్మాణాలు జోరందుకున్నాయి. పోలీసుల హెచ్చరికలు సైతం పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ స్థలంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నా పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే....

రైల్వేకోడూరు పట్టణం లక్ష్మీపార్యడైజ్ సినిమా హాలు వద్ద ప్రధానదారి పక్కనే ఉన్న నేషనల్ హైవే అథారిటీ స్థలాన్ని ఆక్రమించి భారీ ఎత్తున అక్రమ కట్టడాలు సాగుతున్నాయి. మొత్తం 20 అడుగుల స్థలాన్ని ఆక్రమించారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుత ధర ప్రకారం ఆక్రమిత స్థలం రూ. కోటి విలువ చేస్తుందని అంచనా. ఖద్దరు బాబుల అండతో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. రైల్వేకోడూరు మెయిన్ రోడ్డులో స్థలం చాలా విలువైన స్థలం కావడంతో ప్రధాన దారికి ఇరువైపులా ఉన్న భవనాల్లో అద్దె భారీ ఎత్తున ఉంటాయి. ఇతర ప్రాంతీయులు రైల్వేకోడూరులో స్థిరపడి కొంత స్థలాన్ని కొనుగోలు చేస్తుంటారు. స్థలానికి ముందు భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని భవన నిర్మాణాలు చేస్తుంటారు. ఇది రైల్వేకోడూరులో పరిపాటిగా మారింది. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు అట్లే వాలిపోయి ఆక్రమించి భవనాలు నిర్మాణాలు సాగిస్తారు. ఇది కేవలం ఖద్దరు బాబుల అండతోనే సాగుతోంది. ఎక్కడా లేని విధంగా రైల్వేకోడూరులో ఈ తంతు సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. చికెన్ దుకాణానికే ఇంత పెద్దగా నిర్మాణం చేస్తున్నారంటే షాపింగ్‌కు అయితే ఇంకెంత పెద్ద భవనం కడతారా అని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు ప్రధానదారిలో ఎక్కడ చూసినా ఆక్రమణలే కనిపిస్తున్నాయి. డాక్యుమెంట్‌లో ఎక్కడా నిర్మాణాలు సా గడం లేదు. డాక్యుమెంట్‌లో 60 అడు గుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉంటే పొడవులో 100 అడుగులు, వెడ ల్పులో 30 అడుగులు కలిపి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ఈ తతంగం తెలిసినా నేషన్ హైవే అథారిటీ అధికారు లు పట్టించుకోకుండా ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి, సర్వే చేయించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నేషనల్ అథారిటీ అధికారి ఏమంటున్నారంటే

లక్ష్మీప్యారడైజ్ సినిమా హాలు స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని జిల్లా నేషనల్ అథారిటీ అధికారి నారాయణ నాయక్ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని, సర్వే చేయమని తహసీల్దార్‌ను కోరామన్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పోరుమామిళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తీవ్ర మనోవేదనకు గురైన తమ్మిశెట్టి పెద్దవెంకటేశ్ (70) విష రసాయనం తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ మూర్తి తెలిపారు. ఆయన పాత్రికేయులకు తెలిపిన వివరాలిలా... సిద్దనకిచ్చాయపల్లెకు చెందిన తమ్మిశెట్టి పెద్దవెంకటేశ్ భార్య చనిపోయినప్పటి నుంచి మనోవేదనకు గురయ్యాడని, శుక్రవారం ఉదయం విష రసాయనం తాగడంతో అతని కుమారుడు, బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం చనిపోయాడు. శనివారం కుమారుడు చలపతి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

దాతలకు సన్మానం

బ్రహ్మంగారిమఠం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కనుమ పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి రేకులషెడ్డు అమర్చిన దాతలను దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ సన్మానించారు. సుమారు రూ.5లక్షలతో బళ్లారి వాస్తవ్యులు చేపట్టారని ఈ సందర్భంగా దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ దాతలను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించినట్లు తెలిపారు. బళ్లారి వాస్తవ్యులు భీమినేని రంగయ్య, భీమినేని విష్ణువర్ధన్, భీమినేని ప్రసాద్, భీమినేని భాస్కర్‌నాయుడు, సోంపల్లె రమేశ్, మోదుపల్లి సుబ్బరాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పంచలోహ కవచం



పంచలోహ కవచాన్ని సమర్పిస్తున్న దాతలు

బద్వేలు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వల్లెలవారిపల్లెలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి వారికి పంచలోహ కవచం (తొడుగు)ను బహూకరించారు. శనివారం అదే గ్రామానికి చెందిన దివంగతులు నల్లం బాలక్రిష్ణ(ఆర్మీ) సతీమణి అర్చన రూ.1.30లక్షలు విలువైన కవచం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి కవచ సంప్రోక్షణ నిర్వహించి అలంకరించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అన్నదానానికి రూ.50వేలు విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న దాతలు

చక్రాయపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడపకు చెందిన పవన్‌కల్యాణ్ తల్లిదండ్రులు కె.ఆనంద బాబు, వనిత, కుటుంబ సభ్యులు రూ.50వేలు చెక్కు రూపంలో విరాళం అందించారు. వీరిక ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ కె.వెంకటసుబ్బయ్య, మాజీ పాలక మండలి చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చకులు కేసరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తైలాభిషేకం మహోత్సవం

కడప కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశి సందర్భంగా శనివారం స్థానిక రామక్రిష్ణ నగర్‌లో వెలసిన శ్రీసాయి శనీశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి తైలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధా న అర్చకులు వారణాసి శ్రీధర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి పెద్దఎత్తున భక్తులు స్వామివారి సేవలో తరించారు.

విలేకరి పేరుతో బలవంతపు వసూళ్లు

దువ్వూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇడమడక వద్ద విలేకరినని చెప్పుకుంటూ ఇండ్ల కుమార్‌రాజా ఇసుక ట్రాక్టర్ల వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడ్డాడని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. రాత్రివేళ దోచుకుంటున్న విషయం పోలీసులకు సమాచారం అందడంతో అతన్ని అరెస్టు చేశామన్నారు. ప్రతి ట్రాక్టర్ నుంచి రూ.5 వేలు వసూళ్లకు పాల్పడ్డాడని డబ్బు ఇవ్వకపోతే పిడిబాకుతో బెదిరింపులకు సైతం పూనుకున్నట్లు చెప్పారు. వ్యక్తి ట్రాక్టర్ యజమానులను ఇలా బెదిరింపులకు పూనుకోవడంతో దువ్వూరులోని వై.జంక్షన్ వద్ద అరెస్టు చేసి శనివారం కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

హత్యా.. ప్రమాదమా...?



యువకుడి మృతదేహం

పులివెందుల టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బసిరెడ్డి పల్లె దారిలో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో పాలెంవిజయ్ (23) మృతి చెందాడు. విజయ్ పట్టణంలోని భాకరాపురం జయమ్మ కాలనీలో నివసిస్తున్నాడు. మీషో ఆన్‌లైన్ పార్సల్ సర్వీసులో పనిచేస్తూ ఉన్నాడు. ఒక ప్రమాదం జరిగి యువకుడు మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం రావడంతో ట్రాఫిక్ సీఐ హాజీ వల్లి, అర్బన్ ఎస్ఐ విష్ణు నారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని చూసి ప్రమాదం జరిగినట్లు ఆనవాళ్లు నమ్మశక్యంగా కనిపించలేదని చెబుతున్నారు. ఖచ్చితంగా అది హత్యనే అని అనుకుంటున్నట్లు తెలిసింది. ఇది హత్యనా లేక ప్రమాదమా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు ప్రతిభ కనపరచాలి



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు కళల్లో ప్రతిభ కనపరచాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శ్రీకృష్ణ గీతాశ్రమంలో శనివారం నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో రాయలసీమ సంగీత నృత్యోత్సవాల్లో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాల్లో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు ఎంతో ప్రసిద్ధి పొందాయని, వాటిలో చిన్నారులను ప్రోత్సహించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని, మన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొద్దుటూరులో కళాక్షేత్రం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు మొహిద్దీన్‌ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికే రాయలసీమస్థాయి సంగీత నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలువురు కళాకారులకు రాయలసీమ సంగీతరత్న, కళారత్న అవార్డులను అందజేస్తామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాయలసీమ, బళ్లారి ప్రాంతాల నుంచి 250 మంది కళాకారులు హాజరయ్యారు. కేంద్ర సంగీత నాటక అకాడమి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, ఎస్వీ సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జమునారాణి, నాట్యకళాప్రపూర్ణ డాక్టర్ వెంకటసుబ్రమణ్యం, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరినారాయణ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు: సీఐ

పెండ్లిమర్రి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కడప రూరల్ సీఐ చల్లని దొర తెలిపారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు కోడి పందేలు, పేకాట, అసాంఘిక కార్యక్రమాలు చేయరాదన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

సింహాద్రిపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సింహాద్రిపురం ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ పేర్కొన్నారు. పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ ఆదేశాల మేరకు సింహాద్రిపురం మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని ఎస్‌ఐ సూచించారు. కోడి పందేలు, జూదం కోసం స్థలాలు ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

'ఏపీజీబీ తరలింపు అన్యాయం'

వల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కడపలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయం అని, తరలింపును వెంటనే ఆపాలని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వల్లూరులో కరపత్రాలు పంపిణీ చేశారు. రాయలసీమను ఎడారిగా చేయాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే రాయలసీమలో సరైన విద్య, వైద్య సదుపాయాలు లేక ఇతర ప్రాంతాలకు వెళుతున్నారన్నారు. సంస్థలను తరలిస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

డాక్టరేట్ ప్రదానం



ఆవుల వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాల అప్లైడ్ మ్యాథమేటిక్స్ స్కాలర్ ఆవుల వెంకటేశ్వర్లుకు యోగి వే మన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. అప్లైడ్ మ్యాథమేటిక్స్ విభాగ సహ ఆచార్యులు డాక్టర్ ఎస్.సునీత పర్యవేక్షణలో థిరిటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ద క్యారెక్టర్ స్టిక్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఆన్ వేరియస్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్పేర్ బై యూజింగ్ స్టాటిస్టికల్ టూల్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఆవుల వెంకటేశ్వర్లుకు వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు డాక్టరేట్ సర్టిఫికేట్‌ను జారీ చేశారు. ఆయన పరిశోధన పత్రాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

రోడ్లు అధ్వానం.. రాకపోకలు కష్టం

చక్రాయపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలలోని రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారయ్యాయి. ప్రజలు ఆ రోడ్లపై ప్రయాణించాలంటే నరక యాతన అనుభవిస్తున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. 'పల్లె రోడ్లను పట్టించుకోండి సారూ..' అంటూ వేడుకుంటున్నారు. కల్లూరుపల్లె, సిద్దావాండ్లపల్లె, కాట్లగుంటవానిపల్లె, బీఎస్‌తాండ, గరుగుతాండ, చక్రాయపేటలోని గండికొవ్వూరు, ఇసుకచింతలపల్లె, చిలేకాంపల్లె గ్రామంలోని గొంది, గడ్డంవారిపల్లెతో పాటు తక్కళ్లపల్లె, వరికుంటపల్లె తదితర గ్రామాల్లోని రోడ్లు ధ్వంసమైపోయాయి. తారు రోడ్లు పాడైపోవడంతో వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. ఆ రోడ్లపై వెళ్లాలంటే గ్రామీణ ప్రాంతాల వారు భయపడుతున్నారు. ఆటోలు, బైకులు, జీపులు, కార్లు లాంటివి ఆ రోడ్లపై వెళ్లాలంటే గంటల కొద్దీ సమయం పడుతోంది. గ్రామీణ రోడ్లపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి తారు రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



చక్రాయపేట మండలంలోని ఇసుకచింతలపల్లె రోడ్డు దుస్థితి



ధ్వంసమైన గండికొవ్వూరు తారు రోడ్డు

రోడ్లను బాగు చేయండి



మండల కేంద్రంలోని గండికొవ్వూరు, ఇసుకచింతలపల్లె, కల్లూరుపల్లె గ్రామాల్లోని రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. ట్రాక్టర్లు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయి. అలాగే బైకులపై వెళ్లలేకపోతున్నాం. అధికారులు స్పందించి తారు రోడ్లు వేయించాలి.

- చంద్ర, ట్రాక్టర్ డ్రైవర్, చక్రాయపేట

పబ్లిక్ నోటీసు

ఈ క్రింది షెడ్యూలులో కనబరచిన సర్వే నంబరులోని 91.25 చ.గ. జాగా కొండూరు శ్రీనివాసరాజుకు 06.01.2005వ తేదీన విక్రయ దస్తావేజు నెం. 169/2005రు ద్వారా సంక్రమించింది. తదుపరి సదరు శ్రీనివాస రాజు 21.10.2008వ తేదీన విక్రయ దస్తావేజు నెం. 4084/2008 రు ద్వారా రెడ్డిచెర్ల శివరాజుకు విక్రయించగా, తాను సదరు జాగాలో షెడ్యూలు దాఖలా ఇంటిని నిర్మించాడని, పిమ్మట సదరు రెడ్డిచెర్ల శివరాజు 05.07.2017వ తేదీన తన భార్య అయిన రెడ్డిచెర్ల సుజితకు సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 3291/2017రు ద్వారా దానము చేసి అనాడే ఆమె స్వాధీనం చేసినాడని, అయితే ప్రస్తుత ఓనరు అయినటువంటి రెడ్డిచెర్ల సుజిత పై తెలిపిన లింకు దస్తావేజులైన దస్తావేజు నెం. 169/2005 మరియు నెం. 4084/2008రు ఒరిజినల్ దస్తావేజులు కనబడుటలేదని చెప్పి, వాటి నకళ్లు ఆధారముగా షెడ్యూలు ఆస్తిని తనఖాగా ఉంచి REPCO Home Finance Ltd., కడప వారి నుండి రుణం పొందగోరుచున్నారు. ఈ రుణం విషయమై ఎవ్వరికైనను అనగా వ్యక్తులు, బ్యాంకులు, ఫైనాన్సు సంస్థలకు ఆక్షేపణలున్నచో క్రింద తెలిపిన అడ్రస్ వారికి ఈ నోటీసు వెలువడిన '7' దినములలోపల వ్రాతపూర్వకంగా తెలుపుకొనవలెను. లేనిచో షెడ్యూలు ఆస్తిని వివాదరహితమైనదిగా పరిగణించి రుణం మంజూరు చేయబడును. తదుపరి వచ్చు ఆక్షేపణలు ఈ రుణం విషయమై REPCO Home Finance Ltd., కడప వారి హక్కులకు ఎలాంటి ప్రతిబంధకం కాజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : కడప, కడప అర్బన్ సబ్ - డి, కడప మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన చిన్నచౌకు గ్రామ పొలంలోని 8వ వార్డులోని చంద్రమౌళినగర్‌లోని డోర్ నెం. 8/392-3-4-3, ప్రస్తుతం కార్పొరేషన్ డోర్‌నెం. 43/392-3-4-3రుకు గల ఆర్.సి.సి. మిద్దె ఇల్లు, బిడువు జాగా వగైరాలకు నెంబరు వారి వివరం : (చిన్నచౌకు గ్రామ పొలంలో) (అసెస్మెంట్‌నెం. 1013070181). సర్కారు పుంజ డి.నెం. 908/2బి2రు పైకి ప్లాట్ నెం. 38రులో **తూర్పు - పడమర :** 22 అడుగులు లేక 6.86 మీటర్లు, **ఉత్తరం - దక్షిణం :** 36 1/2 అడుగులు లేక 11.13 మీటర్లు కొలతల గల జాగా, ఈ జాగాలో ఉండు **తూర్పు - పడమర :** 18 అడుగులు లేక 5.49 మీటర్లు, **ఉత్తరం - దక్షిణం :** 30 అడుగులు లేక 9.15 మీటర్లు కొలతలు గల 540 చ.అడుగులు గల ఆర్.సి.సి. మిద్దె ఇల్లు, బిడువు జాగా వగైరాలకు **హద్దులు : తూర్పు :** ఇతరుల బేసు మట్టం, **పడమర :** ఏసోబు గారి జాగా, **ఉత్తరం :** రస్తా, **దక్షిణం :** ఇదే ప్లాటులోని నారాయణమ్మ గారి బిడువు జాగా.

ఈలోగా పై కొలతలు గల 91.25 చ.గజముల జాగా, ఈ జాగాలో ఉండు 540 చ.అడుగులు ఆర్‌సీసీ మిద్దె ఇల్లు, ఈ ఇంటికి సంబంధించిన యావత్తు అడుగు జాగా, బిడువు జాగా, పైకప్పు, తలుపులు, ద్వారబంధనములు, ఎలక్ట్రిక్ ఫిట్టింగ్‌లు, కరెంటు మీటరు, మీటరు డిపాజిట్, నీటి కొళాయి, కొళాయి డిపాజిట్, నీటి మోటారు మరియు అన్ని ఈజుమెంటు హక్కులతో సహా.

ఇట్లు : M.VENKATA RAMANA, Advocate
1/917-1, Y.M.Palli, Kadapa City - 516004.

ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

కడప(వినాయకనగర్), జనవరి11(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య, యువజన మహాసభలు ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దస్తగిరి, గంగాసురేశ్ పిలుపునిచ్చారు. శనివారం గ్రంథాలయంలో మహాసభలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. జాతీయ స్థాయి పరీక్షలు తెలుగులో నిర్వహించాలన్నారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించాలన్నారు. జిల్లా నాయకులు నాగార్జున, శివ, చంద్ర,అరుణ్ పాల్గొన్నారు.

పద్యపఠన పోటీ విజేతలు వీరే..

కడప కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రచయితల మహాసభలో భాగంగా కడప బాలోత్సవం వారి సౌజన్యంతో శనివారం స్థానిక బాలాజీ నగర్‌లోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించినట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. మొదటి విభాగంలో 6,7,8 తరగతి విద్యార్థులకు వేమన, సుమతి శతక పద్యాలు, రెండో విభాగంలో 9, 10 తరగతి విద్యార్థులకు భాస్కరశతకం పద్యాలపై పోటీలు నిర్వహించారు. ఒక్కోవిభాగం నుంచి ప్రథమ రూ.2వేలు, ద్వితీయ రూ.1500, తృతీయ రూ.1000 నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. మొదటి విభాగంలో వ రుసగా వెంకటదినేష్, ఎం.శివధనుష్, రాధిక, రెండో విభాగంలో భారతి, సమీర్ అహ్మద్, రఘువీర్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు వీరసుదర్శన్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక కడప విభాగం అధ్యక్షుడు శివరామక్రిష్ణారెడ్డి, అరుణ పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జేసీ

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) నూతన సంవత్సర క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రూటా చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్ మాట్లాడుతూ కలెక్టరేట్ నేమ్‌బోర్డును రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూలో కూడా రాయించాలని జేసీని కోరారు. అనంతరం జేసీని సత్కరించారు. జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అఫ్జల్ బాష, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్ పాల్గొన్నారు.

దళితులపై దాడి బాధాకరం: ఎమ్మార్పీఎస్

కడప మారుతీనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దళితులపై దాడి బాధాకరమని ఎమ్మార్పీఎస్ నాయకులు మానికింది వెంకటేష్, మాతయ్య, రాజు, రమేష్, సాల్మన్, పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. మైదుకూరు మండలం టి. కొత్తపల్లెకు చెందిన గంగిపోగు వెంకటయ్య అనే దళితుడికి ఒక ఎకరా ఎనభైసెంట్ల భూమి ఉందన్నారు. అదే గ్రామానికి చెందిన అగ్రకులాల వారు వెంకటయ్య, అతని భార్య చిన్నక్కపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించి వెంకటయ్యకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

శిల్పారామం ముగ్గుల పోటీల విజేతగా రమ్య

కడప కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం శిల్పారామంలో నిర్వహించిన చుక్కలతో కూడిన ముగ్గుల పోటీల్లో ప్రథమ విజేతగా జి. రమ్య (కడప), ద్వితీయ విజేతగా కె.సుప్రజ (కడప), తృతీయ విజేతగా జి. సునీత నిలిచారు. వీరికి వరుసగా రూ.5, వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు బహుమతులను అందజేసినట్లు సంబంధిత పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు

● పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న బీటెక్ రవి

చక్రాయపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీటెక్ రవి రెండు సీసీ రోడ్లు, 18 గోకులాల షెడ్లను ప్రారంభించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో షెడ్డుకు రూ.2.30లక్షలతో మారెళ్లమడక, అద్దాలమర్రి, కుమార్లకాల్వ, ఎరబొమ్మనపల్లె, కె.రాజుపల్లె, కుప్పం, కల్లూరుపల్లె, మహదేవపల్లె, చిలేకాంపల్లె, చక్రాయపేట, కొండవాండ్లపల్లె గ్రామాలలో ప్రారంభించారు. అలాగే ఎర్రబొమ్మనపల్లెలో దాదాపు రూ.8లక్షలతోనూ,కొండవాండ్లపల్లెలో రూ.3లక్షలతోనూ నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అలాగే చక్రాయపేటలో అమర్‌నాథరెడ్డి, భరత్‌రెడ్డిల ఆధ్వర్యంలో చేపట్టిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అలాగే అద్దాలమర్రి మాజీ సర్పంచు రామసుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పట్టెం అశోక్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, యువనాయకుడు ఎల్‌బీఆర్ భాస్కర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, ఏపీఓ రవి, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, పీఆర్ డీఈ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల రక్షణకే గోకులాలు: ఎమ్మెల్యే



చింతకొమ్మదిన్నెలో గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి తదితరులు

సికెదిన్నె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పశువుల రక్షణ కోసమే ప్రభుత్వం గోకులాలు నిర్మిస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో ఇండ్లూరు శం కర్‌రెడ్డి రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎదుగుదలకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 15 వరకు గోకులాలు నిర్మించుకునేందుకు అవకాశం ఉందన్నారు. మండల ఇన్‌చార్జి టి.వి.క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, డి.వి.సుబ్బారె డ్డి, పీరూప్రసాద్, రాజారావు, నజీర్, నా గేంద్ర, మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ జేడీ శారద, డీపీవో రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ, మండల అధికారులు పాల్గొన్నారు.

గోకులాలు రైతులకు ఎంతో మేలు

వల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గోకులాల ఏర్పాటు రైతులకు ఎంతో మేలు అని టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వెం కటేశాపురం గ్రామంలో గోకులాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రూ.23వేలు చెల్లిస్తే ఉపాధి హామీ కింద రూ.2లక్షలు అందించి గోకులాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోటూరు మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి, వెంకటశివానందెడ్డి, సునీల్‌రెడ్డి, నరసింహ, శ్రీనుయాదవ్, క్రిష్ణయ్య రైతులు పాల్గొన్నారు.

కమలాపురంలో గోకులాలు ప్రారంభం

కమలాపురం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలో కొణతల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించిన గోకులాలను మాజీ ఉప మండలాధ్యక్షుడు వాసుదేవరెడ్డి, నీటి సంఘం చైర్మన్ రెడ్డమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమయ్యారు. రైతులు గోకులాలను వినియోగించుకోవాలన్నారు. జూన్ నెల వరకు వ్యవసాయ పనులు చేసుకోలేని వారు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాడి అభివృద్ధికి గోకులాలు ఎంతో మేలు

చెన్నూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాడి అభివృద్ధికి గోకులాలు ఎంతో మేలు అని, ప్రతి రైతు పాడి పశువులకు షెడ్లను (గోకులాలు) ఏర్పాటు చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనరు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో నిర్మించిన గోకులాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మండలానికి 19 గోకులాలు మంజూరయ్యాయని, ప్రస్తుతం 15 పూర్తికాగా, శనివారం మూడింటిని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, ఏపీవో శైలజ, పంచాయతీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వేములలో... మినీ గోకులం షెడ్లను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఏపీఓ మదుసూదన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ

కడప మారుతీనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పదహారేళ్లుగా మెప్మాలో విధులు నిర్వహిస్తున్న ఆర్పీల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లాలు విజ్ఞప్తి చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, రూ.26 వేలు కనీస వేతనం నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమ చేయాలని కోరారు. శనివారం నిర్వహించిన మెప్మా ఆర్పీల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణ ప్రగతి, బీఎల్‌వో డ్యూటీలు, మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించడం, శ్రీనిధి తదితర పనులన్నీ ప్రభుత్వం మెప్మా ఆర్పీలతో చేయిస్తుందన్నారు. ఆర్పీలకు 2019లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, మృతి చెందిన ఆర్పీలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

ఇష్టపడి చదివే వాతావరణం ఏర్పరచుకోండి

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడితో కష్టపడి కా కుండా ఇష్టపడి చదివే వాతావరణం ఏర్పరచుకోవాలని కడప బాలోత్సవం అధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. శనివారం సెయింట్ జోసఫ్ బాలుర ఉన్నత పాఠశాలలో బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సృజనను ప్రోత్సహించాలన్నారు. గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి మాట్లాడుతూమానవ సంబంధాలు సన్నగిల్లాయన్నారు. ప్రధాన కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ చదువుతో కష్టపడే పిల్లలకు బాలోత్సవం ఓ పండుగలాంటిదని అభివర్ణించారు.

'వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

కడప మారుతీనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) :వడ్డెర కులాన్ని తక్షణమే ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు బాలవీరప్ప, హరీష్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఓంశాంతినగర్‌లోని వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలుత వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనం తరం మాట్లాడుతూ వడ్డెర్లను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా వారి అభ్యున్నతికి పాలకులు శ్రద్ధ కనబరచాలని డిమాండ్ చేశారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032. **నిర్వాహక కార్యాలయం:** 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,వౌరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,మన్పోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో దేనినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 23.01.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం.42-107-7&8, 1వ అంతస్తు ఓబుల్ రెడ్డి కాంప్లెక్స్, ఎన్.జి.ఓ కాలనీ, జయనగర్ కాలనీ కడప-516002

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
KZPETPJ2407300003	SANA SUBBARAYUDU	VEMPAPJ2407240008	SHAIK MAHAMMAD ZAID
VEMPAPJ2407300001	RASHEED SAYYAD	KZPETPJ2407220003	KUCHUPAPA NAGENDRA BABU
VEMPAPJ2404300003	SAKEM LAKSHUMMA	KZPETPJ2407200008	CHATLA SAMBA SIVA
VEMPAPJ2407290002	ANKIREDDYPALLI KRISHNAIAH	VEMPAPJ2407200011	AMEERBASHA SHAIK
VEMPAPJ2407270001	SHEK SABBIR	VEMPAPJ2404200002	VEERAGOVINDU CHITTIBOIN
VEMPAPJ2407270002	BABJI SHAIK	VEMPAPJ2407190001	SHAIK BABJI
KZPETPJ2407260001	SUNKI REDDY GANESH KUMAR REDDY	VEMPAPJ2404190012	VALEPU SYMALA
		VEMPAPJ2407170003	SHAIK AHAMMADIMTHIYAZ
VEMPAPJ2404270008	DASTAGIRI NADENDLA	VEMPAPJ2407150002	SATISHKUMAR CHEPPALI
KZPETPJ2407250007	NAGULARAPU SUNIL KUMAR	VEMPAPJ2407150008	BATHALA JAYARAM
VEMPAPJ2407250001	SHAIK MAHAMMAD ZAID	VEMPAPJ2407130002	SIGA SREENIVASULU
VEMPAPJ2407250002	SHAIK MAHAMMAD ZAID	VEMPAPJ2407130003	SHAIK FAKRUN
VEMPAPJ2407250004	VEMAIAH	KZPETPJ2407100007	GANGI REDDY NAGESWARA REDDY
CUDP2PJ2407240002	PARNAPALLI AVULANNA-GARI VENKATAKRISHNAREDDY	VEMPAPJ2407100007	MOGASALA BUJJI
KZPETPJ2407240006	CHATLA PULLAIAH	VEMPAPJ2404100012	SALMA MOGAL
VEMPAPJ2407240002	BABJI SHAIK	VEMPAPJ2310090007	GANGADHAR POTU
VEMPAPJ2407240004	SHEK SABBIR	KZPETPJ2407030004	KUKATLA PALLE PRASANNA KUMAR
VEMPAPJ2407240006	SHAIK MAHAMMAD ZAID		

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ ఎస్. విజయ్ కుమార్** ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 11.01.2025 సం/- అధీకృత అధికారి
స్థలం : కడప శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వేలం వేయు తేది: 23.01.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం. 3-537(పాతనం 93A) 1వ అంతస్తు,ఆంధ్రాబ్యాంక్,మెయిన్‌రోడ్,పులివెందుల,కడపజిల్లా-516390

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
PLVDLPJ2407290004	KOLKAD KHAJA PEER	PLVDLPJ2407180002	VEERABOINA SREENIVASULU
PLVDLPJ2407200003	MULLA AZMATULLA	PLVDLPJ2407180003	VEERABOINA SREENIVASULU
PLVDLPJ2407200004	OMNATH REDDY TAMATAM T		

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ ఎస్. విజయ్ కుమార్** ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 11.01.2025 సం/- అధీకృత అధికారి
స్థలం : పులివెందుల శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వేలం వేయు తేది: 23.01.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం.4-1-796/1, 1వ అంతస్తు,పెట్రోల్‌బంక్ పక్కన,అంజనేయనగర్,నెల్లూరు రోడ్,బద్వేల్,కడపజిల్లా-516227

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
PRMLAPJ2408010006	GURU SEKHAR BUDAMAGUNTLA	PRMLAIP2407150001	SHAIK SHAKEELA BEGUM
		BADVLPJ2404130002	GOLLAPALLI ANAND RAO
PRMLAPJ2407310011	PENIKALA RENUKAMMA	PRDTRPJ2407090002	MAJJARI RAVI SANKAR
MYDKRPJ2407220003	RAGHURAM K	PRDTRPJ2407040003	SHAIK RESHMA
PRMLAPJ2404230011	VENKATA SUBBAMMA VADAMANU	PRMLAPJ2407030007	DEVINENI VENKATA SUBBAREDDY
PRDTRPJ2407150001	BANDI ARUNA	PRMLAPJ2407030016	SREEDHAR GOWD PIDATALA

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయదం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ ఎస్. విజయ్ కుమార్** ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 11.01.2025 సం/- అధీకృత అధికారి
స్థలం : బద్వేల్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వేలం వేయు తేది: 23.01.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం.24-421, 1వ అంతస్తు,బ్యాంక్ మెయిన్ రోడ్ పక్కన,నాగిరెడ్డి కాంప్లెక్స్,జమ్మలమడుగు,కడపజిల్లా-516434

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
JMLMDPJ2407220002	CHAKALI GURUSWAMY		

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయదం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ ఎస్. విజయ్ కుమార్** ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 11.01.2025 సం/- అధీకృత అధికారి
స్థలం :జమ్మలమడుగు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు



వాలీబాల్‌లో మొదటి విజేతకు చెక్కును అందజేస్తున్న కరస్పాండెంట్ గౌతమ్‌రెడ్డి, సింగారెడ్డి కీర్తిచంద్ రెడ్డి తదితరులు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న రామిరెడ్డి విద్యాసంస్థల సిబ్బంది

సికెదిన్నె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పండుగలు మన సంప్రదాయానికి ప్రతీకలని రామిరెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ గౌతమ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రకృతి నగర్‌లోని పి.రామిరెడ్డి విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు, వాలీబాల్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు రూ.60 వేలు, అందజేశారు. సంప్రదాయ దుస్తుల పోటీల్లో రేవారెడ్డి రూ. 50 వేలు గెలుచుకుందన్నారు. విద్యార్థులు పొంగలి వంటలు, భోగిమంటలు ఆస్వాదిస్తూ నృ త్యాలతో అలరిం చారు. కళాశాల చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, సెక్రటరి జయసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ నెల్సన్‌కుమార్, యుగంధర్‌రెడ్డి, గ్లోరీ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న రవీంద్రారెడ్డి



రవీంద్రారెడ్డిని అభినందిస్తున్న రితీష్‌రెడ్డి

కాశినాయన జనవరి11 (ఆంధ్రజ్యోతి) : కాశినాయన మండల టీడీపీ నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి రూ.లక్ష రూపాయలు సభ్యత్వ రుసుము చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.ఆమేరకు శనివారం పార్టీ కేంద్రకార్యాలయం నుంచి రవీంద్రారెడ్డికి వాట్సాప్ ద్వారా సభ్యత్వ కార్డును పంపారు.పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న బసిరెడ్డి రవీంద్రా రెడ్డిని బద్వేల్ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యువనేత కే.రితీష్‌రెడ్డి టీడీపీ నాయకులు కొండా దుగ్గిరెడ్డి, పి.పోలిరెడ్డి తదితరులు అభినందించారు.

జిల్లా ఆసుపత్రిలో ఓపీ సమయం పెంచాలి

ప్రొద్దుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో ఓపీ సమయం పెంచాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల జయరాజ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ ఆనంద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచే కాకుండా మైదుకూరు జమ్మలమడుగు కమలాపురం నియోజకవర్గాల నుంచి రోగులు వస్తుంటారన్నారు. ఓపీ సమయం ఉదయం 9నుంచి 1 గంటవరకు వుండాల్సి వుండగా 12 గంటలకే ముగిస్తున్నారని సూపరింటెండెంట్ ఆనంద్ దృష్టికి తెచ్చారు.ఇందుకుఆయన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పండుగలా మినీ గోకులాలు ప్రారంభం



జమ్మలమడుగు పెద్దదండ్లూరులో మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎర్రగుంట్ల.. మినీగోకులం ప్రారంభం సందర్భంగా ఆవుకు దాణా తినిపిస్తున్న భూపేశ్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధుల సబ్సిడీ కింద నిర్మించిన పశుపెంపకం షెడ్డు (మినీ గోకులం) పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతాయని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా నిర్మించిన పశువుల పెంపకం షెడ్డును మండల పరిధిలోని గోపవరం గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా షెడ్డు నిర్మాణం, పరిసర ప్రాంతాలు తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథక ఏపీవో మహేశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్, రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ మహమ్మద్‌రఫి, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, యువ నాయకుడు బచ్చల వీరప్రతాప్, స్థానిక నాయకులు లక్ష్మణ్, సుబ్బారావు, తాటి శ్రీను, కుళ్ల శ్రీను, బీసీ పుల్లయ్య, డానియేలు, జగదీష్, అంజి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలోని పెద్దదండ్లూరు గ్రామంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సైదున్నీసా, పశుసంవర్ధకశాఖ అధికారులు, పశువుల ఆస్పత్రి డాక్టర్లు, గ్రామ సర్పంచ్ గువ్వల రామాంజనేయరెడ్డి, కూటమి నాయకులు రమేష్‌రెడ్డి, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..:పాడిరైతులకు చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ జమ్మల మడు గు ఇన్‌చార్జి సీ.భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మండలంలోని పెద్దనపాడులో కే.ఈశ్వరమ్మ, తుమ్మల పల్లెలో చలమారెడ్డి, ఇండ్లసిద్దాయపల్లెలో బి.రామక్రిష్టారెడ్డికి మినీగోకులం కింద మంజూరు అయిన షెడ్లను భూపేశ్‌రెడ్డి ఎంపిడీవో వెంకటరమణయ్య, మండల ఎన్‌డీఏ కూటమి ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి తదితరులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ కార్ర్యమంలో ఎంపీడీవో వెంకటరమణయ్య, పశువైద్యాధికారి మహేశ్వరరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఎం.మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచులు బి.శివారెడ్డి, ఎస్.శివారెడ్డి, బంగారురెడ్డి, ఎన్‌డీవో కూటమి నాయకులు రామక్రిష్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కే.శ్రీనివాసరెడ్డి, నిత్యవర్దన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి,రమణ, బాలగంగిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎస్.జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: గోకులాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పోరు మామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, ఎంపీడీవో రమణారెడ్డి, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, ఏపీవో రవీంద్రరెడ్డి అన్నారు. శనివారం పోరుమామిళ్లలో మంజూరైన గోకులాల వాటిలో పూర్తయిన వాటిని వారితో పాటు టీడీపీ నాయకులు కొండా రామక్రిష్టారెడ్డి, కల్లూరి వెంకటక్రిష్టారెడ్డి ప్రారంభించారు.

ముద్దనూరు..: మండల ఉపాధి హామీ పథకంలో నిర్మించిన మినీ గోకులాలను శనివారం జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముందుగా నొస్సంవారిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ గోకులం ను భూపేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముకుందారెడ్డి, పశువైద్యాధికారి హిమబిందు,ఏపీవో గంగయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: మినీ గోకులాల ప్రారంభోత్సవం శనివారం పండుగలా బద్వేలు ఇన్‌ఛార్జ్ రితీష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వీరి వెంట మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, మున్నెల్లి నీటి సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, బద్వేలు టౌన్ టీడీపీ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, కాశినాయన టీడీపీ నాయకులు హోండా షోరూం రవీంద్రనాథరెడ్డి, రాఘవరెడ్డి, మిషన్ దుగ్గిరెడ్డి, కొండా రామిరెడ్డి, జయసుబ్బారెడ్డి ఉపాధి ఏపీవో రాజా సాహెబ్, ఈసీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు..:మండలంలోని అట్లూరు గ్రామంలో గోకులంషెడ్లను బద్వేలు నియోజకవర్గం ఇన్‌చార్జ్ రితీష్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలో 25 గోకులం షెడ్లు మంజూరయ్యాయని10 గోకులం షెడ్లు పూర్తయ్యాయన్నారు.ఈ కార్యక్రమంలో షెడ్లు నిర్మించిన రైతు శివరాంరెడ్డి, మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ రమాదేవి, టీడీపీ నాయ కులు పోతిరెడ్డి రెడ్డయ్య, అమర్‌నాథరెడ్డి, మహేశ్వ ర్‌రెడ్డి, ఎంపీడీవో భాస్కర్‌బాబు, పశువైద్యాధికారి శిరీష, ఈసీ సుధాకర్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జయక్రిష్ణారెడ్డి, మస్తాన్, పంచాయతీ సెక్రటరీ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: ప్రభుత్వం పాడి రైతులకు నిర్మించిన గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని దుంపలగట్టు, రావులపల్లె, పత్తూరు, ఆంజనేయకొట్టాలు, పుల్లూరు, ఖాజీపేట, భూమాయపల్లె, కొత్తపల్లె, ఏటూరు, తుడమలదిన్నె, తవ్వారుపల్లె పంచాయతీల్లో 15 షెడ్లను ఎంపీడీవో గిరిజాసంపతి, టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, భూమాయపల్లె సర్పంచ్ వెంకటసుబ్బయ్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

22న పి. అనంతపురం

నిర్వాసితుల పత్రాలపై విచారణ

కొండాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 వతేదీ జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో మండలంలోని పి.అనంతపురం నిర్వాసితుల పరిహారానికి సంబంధించి ఆర్డీవో ఆధ్వర్యంలో విచారించనున్నట్లు తహసీల్దార్ గురప్ప తెలి పారు. ఈ గ్రామానికి సంబంధించిన 152 మంది నిర్వాసితుల పరిహారం పెండింగ్‌లో ఉన్నందున, ఆధారాలతో నిర్వాసి తులు హాజరు కావాలన్నారు. కాగా ఈ గ్రామానికి సంబంధించి 28 మందికి మాత్రమే పరిహారం చెల్లించారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

బద్వేలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రేషన్‌షాపు దరఖాస్తుదారులు రాస్తున్న రాత పరీక్షను శనివారం ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. మొత్తం 287 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు రాత పరీక్ష అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించి రేషన్‌షాపు దుకాణదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

సంక్రాంతికి బండలాగుడు పోటీలు

ఖాజీపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెముళ్లపల్లెలోని కోదండరామాలయం కమిటీ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ రోజు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ప్రథమ బహుమతి రూ.25,116, రెండో బహుమతి రూ.20,116, మూడో బహుమతి రూ.15,116, 4వ బహుమతి రూ.10,116, 5వ బహుమతి రూ.3,116 గెలుపొందిన వృషభరాజములకు ఆలయ కమిటీ అందజేయనుంది. 15వ తేదీ కనుమ రోజున పాటకచ్చేరి, కోలాటం భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జమ్మలమడుగు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో కోవెలకుంట్ల రోడ్డు పెద్దపసుపుల గ్రామం వైపు వెళ్లే రోడ్డులో శనివారం రాత్రి కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అధికారులు దాడులు చేశారు. కే.ఓబులేరెడ్డి, కే.రమేష్‌రెడ్డి, ఎం. శివరామిరెడ్డి అనే వ్యక్తులు రేషన్‌బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారు. ఇక్కడ నుంచి బయటి ప్రాంతాలకు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నారనే సమాచారం రాగానే తనిఖీ చేసి పట్టుకున్నట్లు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కాగా వేర్వేరు చోట్ల 15,380 కేజీల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ 7,07,480 రూపాయిలుగా నిర్ణయించారు. పట్టుబడినవారిపై క్రిమినల్ కేసుకు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అధికారులు ఎం. శివన్న, బాలగంగాధర్‌రెడ్డి తదితరులు తెలిపారు.

ఆదర్శ గ్రామంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



ఎస్.ఉప్పలపాడు చెన్నకేశవస్వామి ఆలయం వద్ద కోలాటం

జమ్మలమడుగు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేసిన గ్రామస్థుడు, హైదరాబాదు నివాసి, మాయలూరి రామమనోహర్‌రెడ్డితోపాటు మరికొందరు సందర్శించారు. శనివారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఈశ్వర, చెన్నకేశవస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలోతుంగభద్ర హెచ్ఎల్‌సీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ప్యూజీ సీఈవో మాయలూరి రామమనోహర్ రెడ్డి, శ్రీమన్నానారాయణరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో కోలాటం నిర్వహించి గ్రామంలోని పలు చోట్ల ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి వారు పరిశీలించారు. అనంతరం మొక్కులు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీకృష్ణునికి బెల్లంపాయసం నివేదన



108 కుండలలో శ్రీకృష్ణునికి బెల్లం పాయసాన్ని నివేదిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలలో భాగంగా శనివారం తిరుప్పావై 27వ పాశురం కూడారై వెల్లుఫిర్ గోవింద పాశురాన్ని పఠించారు. ఉదయం 5 గంటలకు గోవింద నామస్మరణలతో నగర సంకీర్తన చేశారు. శ్రీకృష్ణునికి ప్రీతికరమైన 508 మట్టి పాత్రలలో బెల్లంపాయసం పోసి స్వామివారికి నివేదించారు. సోమవారం ఉదయం ఆలయంలో రంగనాయకుల స్వామి కల్యాణం, రాత్రి 8 గంటలకు పాన్పు సేవ నిర్వహిస్తామని ఆలయ ట్రస్టు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలి

ప్రొద్దుటూరు,జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏపీజీఈఏను బలోపేతం చేయాలని ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా ఆసుపత్రిలోని సభాభవనంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19న కడపలో జిల్లా స్థాయి ఉద్యోగుల సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా ప్రొద్దుటూరు తాలుకా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సన్మానించారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, తాలుకా అధ్యక్షుడు ఎంవీ ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, హంస జిల్లా అధ్యక్షుడు బండి రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రొద్దుటూరు బ్యాంకు కన్వీనర్ వెంకటచరణ్‌కుమార్, ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, గౌరీశంకర్, బానుప్రకాష్ పాల్గొన్నారు.

నేడు కొండాపురంలో ఉచిత కంటి వైద్యశిబిరం

కొండాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వివేకానంద స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ లింగేశ్వరరెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా తమ పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు కంప్యూటర్ ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా బస్సు సౌకర్యం, ఉచిత భోజనం కల్పిస్తామని ఆయన తెలిపారు.

రేపటి నుంచి సంక్రాంతి ఉత్సవాలు

చాపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురూరు, నరహరిపురం, రాజుపాళెం గ్రామాల్లో ఈనెల 13వ తేదీ సోమవారం నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వెదురూరు గ్రామంలో శ్రీ సంగమేశ్వర దేవాలయంలో దేవతామూర్తులు అయిన శివపార్వతీదేవి వెలిసి ఉన్నారు. ప్రతి ఏడాది సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వెదురూరులో డ్యాన్స్ ప్రోగ్రాం, కోలాటం నిర్వహిస్తున్నారు. 15న రాష్ట్రస్థాయి ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.70 వేలు, మూడో బహుమతి రూ.40 వేలు ఇస్తున్నట్లు వారు తెలిపారు.

నేడు గోకులాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా ఇటీవల మండలంలో గోకులాలను (పశువుల షెడ్లు) నిర్మాణాలను చేపట్టారు. అవిపూర్తి కావడంతో ఆదివారం ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రంగయ్య తెలిపారు. తోట్లపల్లె, సోమిరెడ్డిపల్లె, గొడ్లవీడు, దిగువనేలటూరు, దిరసవంచ, నాగిశెట్టిపల్లె, రేకులకుంట్ల, ముడుమాల పంచాయతీల్లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



'కాలేజీని మార్చండి'

కొండాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొండాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీని ముంపు ప్రాంతం నుంచి కొత్త గ్రామంలోకి మార్చాలని కళాశాల సిబ్బంది శనివారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డికి దేవగుడిలో, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి ఎర్రగుంట్లలో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం

బద్వేలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలలో భాగంగా పట్టణంలోని సుభాష్ గాయత్రి కళాశాలలో ఈ నెల 13వ తేదీ యువశక్తి యూత్ ఆధ్వర్యంలో సూపర్ సిక్సర్ మెగా క్రికెట్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు సంస్థ సభ్యులు బాబి, సూర్య పేర్కొన్నారు.వివరాలకు 8520937336, 9160092246 నంబర్లను సంప్రదించాలన్నారు.

నియోజకవర్గ స్థాయి టోర్నమెంటు

బద్వేలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గస్థాయి విలేకరుల సంక్రాంతి సంబరాల సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో టోర్నమెంటు బద్వేలు పట్టణంలోని మడకలవారిపల్లె గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ క్రికెట్ పోటీలలో నియోజకవర్గస్థాయిలో విలేకరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

బ్రహ్మంగారిమఠం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎద్దులాయ పల్లెలో శనివారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు

ఆర్థిక సాయం

దువ్వూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరుకు చెందిన మృతుడు మల్లేశం కుటుంబానికి శనివారం దాతలు రూ.37 వేలు ఆర్థికసాయం అందజేశారు. దీంతో బియ్యం, బట్టలను అందజేశారు. డిసెంబరు 20వ తేదీన 'అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య అనాథలైన కుటుంబ సభ్యులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. అప్పట్లో ఈ కథనం చూసిన దాతలు రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు. తదనంతరం శనివారం బి.నాగరాజు, సంధ్యారాణి, పి.వెంకటసుబ్బయ్య, అబ్దుల్ హఫీజ్ మిత్ర బృందం సేకరించిన నగదు, ఇతరత్రా ఆ కుటుంబ యజమాని సుమలత, ఆమె నలుగురు ఆడ పిల్లలకు ఈ మొత్తం అందజేశారు. వారికి ధైర్యం చెప్పారు. బాధితులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌ఓసీ లేకుండా విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

బద్వేలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో గృహ నిర్మాణాలు చేపడుతున్నవారికి ఎన్‌ఓసీతో సంబంధం లేకుండా విద్యుత్ మీటర్లు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు సంగటి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న నిర్మాణాలకు ఎన్‌ఓసీ నిబంధనలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.